క్లుప్తంగా

సంగాలలో వైద్య పరీక్షలు



ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సి.బెళగల్: మండలంలోని సంగాల గ్రామంలో బుధవారం ఎంఎల్‌హెచ్‌పీ హేమలత, ఏఎన్‌ఎం పుష్పావతి ప్రజలకు వైద్య పరీక్షలను నిర్వహించారు. గర్భిణులతోపాటు సాధారణ ప్రజలకు సైతం బీపీ, సుగర్, హెచ్‌బీ తదితర వైద్య పరీక్షలను నిర్వహించారు. అవసరం మేరకు ఉచితంగా మందులు అందజేశారు.

శబరిమలైకు తరలివెళ్లిన స్వాములు



అయ్యప్పస్వామికి పూజలు నిర్వహిస్తున్న స్వాములు

కోడుమూరు రూరల్ : అయ్యప్పమాల ధరించిన స్వాములు 40మందికి పైగా బుధవారం కోడుమూరు నుంచి శబరిమలైకు తరలివెళ్లారు. ముందుగా స్థానిక ధర్మపురి అయ్యప్పస్వామి ఆలయంలో దీక్షాపరులు అయ్యప్పస్వామికి పూజలు నిర్వహించారు. గురుస్వాములతో ఇరుముడులు కట్టించుకుని అయ్యప్పకు సమర్పించేందుకు శబరిమలైకు బయలుదేరారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వారిని సాగనంపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నలుబోలు భాస్కరరెడ్డి, లక్ష్మన్న, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్ : ప్రభుత్వ నిర్ణయించిన ధరలకంటే అధిక ధరలకు ఎరువులు, మందులను రైతులకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏఓ రవిప్రకాష్ హెచ్చరించారు. మండల కేంద్రం కోడుమూరులోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఏఓ తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్లు, రికార్డులను ఏఓ పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ రైతులు అడిగిన మందులను మాత్రమే ఇవ్వాలని, తప్పనిసరిఅ రసీదు ఇవ్వాలని ఏఓ దుకాణదారులకు సూచించారు. అనంతరం మూడు రసాయనిక ఎరువుల నమూనాలను ఏఓ సేకరించి నాణ్యత ప్రమాణాల నిమిత్తం అమరావతి ల్యాబ్‌కు పంపారు.

ఉపాధి పనులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి

కల్లూరు: జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరూ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి సూచించారు. కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. పశువులు షెడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. కూలీలందరికి వంద రోజులు పనులు కల్పించాలన్నారు. హార్టికల్చర్ రైతులకు ఉపాధి పనుల గురించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓలు మద్దేశ్వరమ్మ, రమాదేవి, ఈసీ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైపులో రాళ్లు వేసిన ఆకతాయిలు



పారిశుద్ధ్య కార్మికులతో రాళ్లు, చెత్తను తీయిస్తున్న ఎంఈఓ

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం చెంచుకాలనీలోని గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలకు చెందిన డ్రైనేజీ పైప్‌లైన్‌లో ఆకతాయిలు రాళ్లువేశారు. పాఠశా బయట పైప్‌లైన్‌లో రాళ్లతో పాటు చెత్తచెదారం వేయడంతో మురుగునీరు నిలిచిపోయింది. దుర్వాసన వెదజల్లడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ–2 సుబ్రహ్మణ్యం, పాణ్యం ఈఓ ఆనందరావు అక్కడికి చేరుకుని పారిశుద్ధ్య కార్మికులతో రాళ్లు, చెత్తను బయయకు తీయించారు. సంఘటనపై ప్రిన్సిపాల్ సునందలక్ష్మీతో ఎంఈఓ ఆరా తీశారు. పోలీసులకు సమాచారం అందిస్తామని ఆయన తెలిపారు.

వీరాంజనేయస్వామికి పూర్వవైభవం

- స్వామివారికి పెరుగుతున్న ప్రజాదరణ
- రూ.2 కోట్లతో పురాతన ఆలయాభివృద్ధి
- పున్నమి, అమావాస్యకు పోటెత్తుతున్న భక్తులు
- కాలగర్భంలో కలిసిపోయిన బొడ్డువానిపల్లెకు మళ్లీ గుర్తింపు



స్వామివారి దర్శనార్థం తరలివచ్చిన భక్తులు (ఫైల్)

ఓర్వకల్లు: మండల పరిధిలో వెలసిన బొడ్డువానిపల్లె వీరంజనేయ స్వామి ఆలయానికి పూర్వవైభవం వచ్చింది. స్వామివారు మహా శక్తివంతుడని భక్తుల నమ్మకం. స్వాముల వారిని దర్శించుకుంటే అనుకున్న కోరికలు తప్పక నెరవేరుతాయనేది భక్తుల విశ్వాసం. అదే విశ్వాసంతో ప్రతి అమావాస్య, పౌర్ణమి రోజుల్లో స్వాముల వారి దర్శనార్థం సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అశేషంగా తరలివస్తున్నారు. ఆయా రోజుల్లో ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంది. కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా మళ్లీ ప్రసిద్ధికెక్కారు. క్రీ.శ.200 ఏళ్ల క్రితం మరుగునపడిన ఆలయం నేడు భక్తులతో కళకళలాడుతోంది. భక్తులు, దాతల సహకారంతో రూ.2 కోట్లతో ఆలయ అభివృద్ధి జరిగింది. భక్తుల సౌకర్యార్థం వంట గది, కల్యాణ మండపం, సీతారాముల విగ్రహాలు, నవగ్రహాలను ప్రతిష్టించారు. ప్రస్తుతం ఆలయంలో పెళ్లిల్లు జరుగుతున్నాయంటే స్వామివారి మహిమలతోనే అని నమ్మకంగా చెబుతున్నారు భక్తులు.

నాటి బొడ్డువానిపల్లె.. నేటి భైరాపురం

పూర్వం మండలంలోని లొద్దిపల్లె గ్రామానికి 6 కి.మీల దూరంలో ఎర్రమల కొండల మధ్య బొడ్డువానిపల్లె అనే కుగ్రామం ఉండేది. అక్కడ సుమారు 500 కుటుంబాలు నివసించినట్లు పూర్వికుల సమాచారం. ఆ రోజుల్లో పాడి పశువులతో గ్రామం కళకళలాడేదని నానుడి. పాడిలేని ఇళ్లు ఉండేదికాదు. ప్రతి ఇంట్లో నిత్యం మజ్జిగ ఉండేవట. వీరాంజనేయ స్వామిపై గ్రామస్తులకు అపారమైన నమ్మకం. అప్పట్లో ప్రతి అమవాస్య, పౌర్ణమి దినాలతో పాటు, శ్రీరామనవమి, ఉగాది పర్వదినాల్లోనూ స్వాముల వారికి పాలు, వెన్న, మజ్జిగ సమర్పించేవారని నానుడి. అయితే వీరాంజనేయస్వామి సాధురూపంలో గ్రామస్తులను పరీక్షించారట. ఇంటింటికీ తిరుగుతూ మజ్జిగ పోయాల్సిందిగా గ్రామస్తులను అభ్యర్థించగా ఏ ఒక్కరు కనుకరించలేదట. ఓ వృద్ధురాలు మాత్రం సాధువుపై జాలి చూపుతూ స్వాములవారికి సమర్పించేదుకు తీసుకెళ్లతున్న మజ్జిగను ఇచ్చినట్లు నానుడి. దీంతో ఆ సాధువు.. అవ్వా! నీవు వెనక్కి తిరిగి చూడకుండా ఇంటికెళ్లి కుటుంబంతో సహా ఊరు వదలిపొమ్మని ఆజ్ఞాపించారట. కొంతదూరం వెళ్లిన వృద్ధురాలు తిరిగి చూసేసరికి సాధువు లేక పోవడంతో ఆ గ్రామం నుంచి వెళ్లిపోయి బయన్నస్వామి చెరువు సమీపంలో స్థిరపడినట్లు సమాచారం. అయితే సాధువు శాపం మూలంగా బొడ్డువారిపల్లె ప్రజలతోపాటు పశుసంపద అనారోగ్యాల బారినపడి మృతి చెంది అంతరించిపోయినట్లు స్థానికుల కథనం. వృద్ధురాలు స్థిరపడిన ప్రదేశమే భైరాపురమని స్థానికుల మాట. అయితే రెవెన్యూ రికార్డుల్లో మాత్రం ఇప్పటికీ బొడ్డువారి పల్లెగానే పరిగణిస్తున్నతీరు స్వామివారి చరిత్రకు నిదర్శనమని స్థానికుల తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

బోరు ఏర్పాటుతో మళ్లీ స్వామివారి మహిమలు వెలుగులోకి...

బ్రహ్మయ్యాచారి, రాజశేఖర్‌రెడ్డి, రామదాసు అను ముగ్గురు భక్తులు రైతుల విన్నపం మేరకు బొడ్డువానిపల్లె పరిసర ప్రాంతాలలో వ్యవసాయ బోరు బావులు తవ్వేందుకు ఉపక్రమించారు. ఆ ప్రాంతంలో ఎక్కడ నీరు పడలేదు. ఈ నేపథ్యంలో అంజనేయస్వామిని దర్శించుకున్న అనంతరం గుడి వద్ద బోరు వేయగా పుష్కలంగా నీళు పడ్డాయి. దీంతో స్వామివారి మహిమలపై మరింత నమ్మకం పెరిగింది. సమీప గ్రామ ప్రజలు కమిటీగా ఏర్పడి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు దాతలను ఆశ్రయించారు. దాతల సహకారంతో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే మధ్యలోనే ఆలయ నిర్మాణం నిలిచిపోయింది. ఈ క్రమంలో కమిటీ సభ్యులు పుసులూరు ప్రభాకర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. ముందుగా భైరాపురం నుంచి ఆలయం వరకు నాలుగు కి.మీల మేర రహదారిని నిర్మించారు. అనంతరం స్వాముల వారి గుడిని నిర్మించారు. పుసులూరు ప్రభాకర్‌రెడ్డితోపాటు ఇతర దాతల సహకారంతో దాదాపు రూ.2 కోట్లతో ఆలయ అభివృద్ధి చేశారు. దీంతో స్వామివారికి పూర్వవైభవం వచ్చింది.



ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయస్వామి



బొడ్డువానిపల్లె గ్రామానికి ఆనవాలుగా నిలిచిన బురుజు

భోజన నిర్వాహకులపై డీడీ శ్యామల ఆగ్రహం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీడీ శ్యామల

సి.బెళగల్: మండలంలోని సంగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మధ్యాహ్న భోజన నిర్వాహకులపై మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆమె పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. అయితే మెనూ పాటించకపోవడంతో నిర్వాహకులపై మండిపడ్డారు. ఆలుకుర్మాను సాంబరులా తయారు చేయించడం ఏమిటని ఉపాధ్యాయులను డీడీ ప్రశ్నించారు. గతంలోనే హెచ్చరించినా మార్పులేదని, పద్ధతులు మార్చుకోకుంటే చర్యలు తప్పవని డీడీ హెచ్చరించారు.





నగర శివారులోని జీఆర్‌సీ కన్వెన్షన్‌లో బుధవారం జరిగిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేంద్ర రెడ్డి కుమార్తె వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి, మేయర్ బీవై రామయ్య, కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ, నాయకుడు కాటసాని నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

లక్ష్మీమాధవస్వామి ఆలయంలో వేలం పాట



టెంకాయల వేలం పాట నిర్వహిస్తున్న ఈఓ గుర్రెడ్డి

కోడుమూరు రూరల్ : కోడుమూరు మండలం గోరంట్ల గ్రామంలో వెలసిన లక్ష్మీమాధవస్వామి ఆలయ సన్నిధిలో ఏడాది పాటు టెంకాయలు అమ్ముకునేందుకు బుధవారం దేవాదాయ శాఖ అధికారులు వేలం పాట నిర్వహించారు. మొత్తం 10మంది పాటదారులు పాల్గొనగా, మద్దిలేటి రెడ్డి అనే వ్యక్తి అత్యధికంగా రూ.7.10 లక్షలకు వేలం పాడి పాట దక్కించుకున్నాడు. గతేడాది రూ.2.75లక్షలు పలికిన టెంకాయల వేలం పాట ఈ ఏడాది అత్యధికంగా రూ.7.10లక్షలకు పోవడం విశేషం. కార్యక్రమంలో ఈఓ గుర్రెడి, ఇన్‌స్పెక్టర్ రమేష్, సిబ్బంది మురళీ, మాధవనాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

కల్లూరు: ఆధార్ ప్రత్యేక క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి సూచించారు. బుధవారం సల్కాపురం, చిన్నటేకూరు గ్రామాల్లో జరుగుతున్న ఆధార్ ప్రత్యేక క్యాంపులను ఆయన పర్యవేక్షించారు. ఆధార్ కార్డులో చిరునామా మార్పు, ఫోన్ నెంబర్ లింక్ చేసుకోవడం, అలాగే 0 నుంచి 5 సంవత్సరాలలో పిల్లలకు కొత్త ఆధార్ కార్డు నమోదు చేసుకోవచ్చున్నారు.

నేడు ఆధార్ ప్రత్యేక కేంద్రాలు

కర్నూలు(రూరల్): మండల పరిధిలో తులాశపురం, బసావపురం, నిడ్జూరు, పడిదెంపాడు గ్రామాలలో గురువారం ప్రత్యేక ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథ్ తెలిపారు. ఆయా గ్రామాల సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తున్నామని, కొత్త కార్డులతో పాటు మార్పులు, చేర్పులు చేస్తామన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఆధార్ ప్రత్యేక కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

22 వరకు పత్తి కొనుగోళ్లు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నిర్వహిస్తున్న పెంచికలపాడు పత్తి కొనుగోలు కేంద్రంలో ఈనెల 22 వరకు పత్తి కొనుగోళ్ల బంద్ చేసినట్లుగా జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణ మూర్తి తెలిపారు. గూడూరు మండలం పెంచికలపాడులోని మంజిత్ కాటన్‌మిల్‌లో మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేస్తున్నారు. మిల్లులోని యంత్రాల్లో సాంకేతిక సమస్యలు ఏర్పడినందున ఈ నెల 22వ తేదీ వరకు పత్తి కొనుగోళ్ల నిలిపి వేసినట్లు బుధవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. 23వ తేదీ నుంచి మద్దతు ధరతో కొనుగోళ్ల జరుగుతాయని, కొత్త టోకెన్‌ల కోసం రైతులు ఆ రోజున కొనుగోలు కేంద్రానికి రావాలని సూచించారు. ఇది వరకే టోకెన్‌లు బుక్ చేసుకున్న రైతులు కొత్త షెడ్యూలు ప్రకారం పత్తి తీసుకరావాలని తెలిపారు. 19న రావాల్సిన రైతులు 23న, 20 నాటి రైతులు 24న, 21 నాటి రైతులు 26న, 23 నాటి రైతులు 27న, 24 నాటి రైతులు 28న, 26 నాటి రైతులు 30న, 27 నాటి రైతులు 31న కొనుగోలు కేంద్రానికి పత్తి తీసుకరావాలని సూచించారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న బీకే వెంకటేశులు



తహసీల్దార్‌కు సమస్య వివరిస్తున్న రైతు



రైతుల నుంచి వినతి స్వీకరిస్తున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(రూరల్): భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోడమూరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ బీకే వెంకటేశులు సూచించారు. మండల పరిధిలోని దిన్నెదేవరపాడు గ్రామంలో బుధవారం డిప్యూటీ తహసీల్దార్ శివ ప్రసాద్ నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు స్పెషల్ ఆఫీసర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వినతులు స్వీకరించిన ఆయన భూములకు సంబంధించిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. రైతుల నుంచి మొత్తం 24 దరఖాస్తులు అందాయని డీటీ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధవస్వామి, వీఆర్వో వేణుగోపాల్‌రెడ్డి, సర్వేయర్లు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మందొడ్డిలో రెవెన్యూ సదస్సు

సి.బెళగల్: మండల పరిధిలోని తిమ్మందొడ్డిలో బుధవారం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించారు. సదస్సులు అందజేసిన ప్రతి వినతికి పరిష్కారం చూపుతామని ఈ సందర్భంగా తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ నాగభూషణం, వీఆర్వోలు శ్రీనివాసులు, సాయిరమణ, సర్వే సహాయకులు నరసింహులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అనుగొండలో రెవెన్యూ సదస్సు

కోడుమూరు రూరల్ : భూ సమస్యల పరిష్కారంలో భాగంగా గురువారం మండలంలోని అనుగొండ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటేష్‌నాయక్ తెలిపారు. భూములకు సంబంధించిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని, రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రెవెన్యూ సదస్సుకు స్పందన కరువు

ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో బుధవారం తహసీల్దార్ విద్యాసాగర్ నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు ప్రజల నుంచి స్పందన కరువైంది. భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన సదస్సులో కుల, ఆదాయ ధ్రువ పత్రాల కోసం దరఖాస్తులు అందజేయడం విశేషం. చివరకు 52 వినతులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శంకర్ మాణిక్యం, సర్పంచ్ పుష్పమ్మ, దేవదాయ శాఖ ఈఓ మద్దిలేటి, మాజీ సర్పంచ్ పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వద్దుగండ్లలో రెవెన్యూ సదస్సు

పాణ్యం: మండల పరిధిలోని వద్దుగండ్ల గ్రామంలో బుధవారం తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ భూ సమస్యలపై 28 మంది రైతులు వినతులు అందజేశారని తహసీల్దార్ తెలిపారు. వినతులు పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు.

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండలో బుధవారం తహసీల్దార్ ఆంజనేయులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సుకు హాజరైన సివిల్ సప్లయ్ డివిజనల్ మేనేజర్, నోడల్ ఆఫీసర్ నాగసుధ రైతుల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 14 అర్జీలు వచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణలను అరికట్టండి



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా



హాజరైన అధికారులు

- ఫీల్డ్ అసిస్టెంట్లు లేకుంటే ఉపాధి పనుల్లో పురోగతి ఎలా సాధిస్తారు?
- 'పల్లె పండుగ' రోడ్లను సంక్రాంతిలోపు పూర్తి చేయాలి
- ఎంఎస్‌ఎంఈ సర్వేను వేగవంతం చేయండి
- అధికారుల సమీక్షలో కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు(సెంట్రల్): గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీలకు సంబంధించిన ఆస్తులు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీల ఆస్తుల పరిరక్షణపై జిల్లాస్థాయి సమావేశం, ఉపాధి హామీ పథకం అమలు, పల్లె పండుగ–రోడ్లు, ఎంఎస్‌ఎంఈ సర్వే పురోగతిపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2011లో ఇచ్చిన జీఓ ప్రకారం పంచాయతీల ఆస్తులకు సంబంధించిన ఇన్వెస్టరీ రిజిస్టర్లను డీఎల్‌పీఓలు కచ్చితంగా నిర్వహించాలన్నారు. రిజస్టర్లు నిర్వహిస్తున్నామని, వివరాలను అప్‌డేట్ చేయాల్సి ఉందని డీఎల్‌పీఓలు చెప్పగా రెండు వారాల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంచాయతీ సెక్రటరీకి పంచాయతీ ఆస్తులపై పూర్తిగా అవగాహన ఉండాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో భూముల ధరలు విపరీతంగా పెరగడంతో ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. భూములను కాపాడాల్సిన బాధ్యత తహసీల్దార్లు, ఎంపీడీఓలు, వీఆర్వోలు, పంచాయతీ సెక్రటరీలపై ఉంటుందన్నారు. ఎక్కడైనా ఆక్రమణకు గురైఉంటే పోలీసు సహకారంతో తొలగించాలని ఆదేశించారు. గ్రామా ల్లో శ్మశానాలు, ఇరిగేషన్ భూములు కూడా ఆక్రమణకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధి పనుల పురోగతిపై అసంతృప్తి

జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలు, పురోగతి తక్కువగా ఉందని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికే 90 శాతం లక్ష్యాన్ని సాధించాల్సి ఉన్నా ఆశించిన మేరకు ఫలితాలు రావడం లేదన్నారు. మండలాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉంటే పురోగతి ఎలా సాధిస్తారని ప్రశ్నించారు. ఆదోని, కోసిగి, కౌతాళం, పెద్దకడబూరు, ఆలూరు, కృష్ణగిరి, దేవనకొండ, తుగ్గలి మండలాల్లో ఫీల్డ్ అసిసెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయని ఎంపీడీఓలకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అనదపు పీడీ ఆదేశించారు. వారంలోపు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించకపోతే ఎంపీడీఓలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి హామీలో సిబెళగల్ మండలంలో 84 శాతం పురోగతి సాధించగా ఎమ్మిగనూరు, నందవరం, గోనెగొండ్ల, వెల్దుర్తి, ఓర్వకల్, కౌతాళం మండలాల్లో 60 శాతం మాత్రమే పురోగతి సాధించడంపై ఎంపీడీఓలను ప్రశ్నించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధి పనుల కల్పనలో వెనకబడిన చివరి ఐదు మండలాల ఎంపీడీఓలను ప్రతి శనివారం పిలిపించి వివరణ అడుగుతామన్నారు. పల్లె పండుగలో భాగంగా 830 పనులు మంజూరు కాగా, అందులో ఇప్పటివరకు 581 పనులు మాత్రమే పూర్తయ్యాయన్నారు. ఇందులో మంత్రాలయం, ఆలూరు, పెద్దకడబూరు, కోసిగి, కౌతాళం, చిప్పగిరి, కోడుమూరు, ఆస్పరి మండలాల్లో జరిగే పనుల్లో పురోగతి లేదని, సంక్రాంతిలోపు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ఎంఎస్‌ఎంఈ సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. జేసీ డాక్టర్ బి.నవ్య, అదనపు ఎస్పీ (అడ్మిన్) జి.హుస్సేన్‌పీరా, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, కర్నూలు ఆర్‌డీ ఓ సందీప్‌కుమార్, పీఆర్ ఎస్‌ఈ రామచంద్రారెడ్డి, గనుల శాఖ అధికారి రవిచంద్, డీపీఓ భాస్కర్, జలవనరుల శాఖ ఈ.బాలచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై అధికారులకు ఇస్తున్న శిక్షణా తరగతులు బుధవారం ముగిశాయి. రెండురోజుల పాటు సాగి న శిక్షణా తరగతుల్లో గ్రామాల అభివృద్ధికి చేపట్టా ల్సిన చర్యలపై అధికారులు, సర్పంచ్‌లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాల య సూపర్‌డెంట్ శ్రీనివాసులు, పీఆర్, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ లు వెంకటప్రకాష్, గోనెనాయక్, ఏఈఓ రామన్న, ఏపీఎం రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు (రూరల్): గ్రామాలు అన్నివిధాలుగా అభివృద్ధి సాధించేందుకు అధికార యంత్రాంగం కృషి చేయాలని ఎంపీడీఓ రఘునాథ్ సూచించారు. కర్నూలు ఎంపీడీఓ సమావేశ భవనంలో రెండవ రోజు బుధవారం సుస్థిర అభివృద్ధి లక్ష్యలపై అధికారులు, సర్పంచ్‌లకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు ముగిశాయి. తాగునీరు, మౌలిక వసతులు, సహజ వనరులు, కుటీర పరిశ్రమలు తదితర అంశాలపై శిక్షణా తరగతులు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజులపల్లె గ్రామం వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు ఉదయం పాణ్యం గ్రామానికి చెందిన చెంచు మహిళలు వ్యవసాయ పనులకు ఆటోలో వెళ్తున్నారు. ఆటోలో వెనుక కూర్చున్న తోటరాములమ్మ ప్రమాదవశాత్తు కిందపడడంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నంద్యాల జీజీహెచ్‌కు తరలించినట్లు చెప్పారు.

నేడు రామయ్య తాత రథోత్సవం

కల్లూరు: తడకనపల్లెలో వెలసిన రామయ్య తాత ఆరాధన మహోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం ఉంటుందని నిర్వాహకులు దామోదర్‌రెడ్డి, చిన్న స్వాములు, సోమన్న బుధవారం తెలిపారు. సాయంత్రం 5 గంటలకు రథోత్సవం ప్రారంభమవుతుందన్నారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా శుక్రవారం సాయంత్రం పారువేట ఉంటుందని చెప్పారు.